# భాగ్యవంతుడు

శ్రీ ఆకెళ్ల శాస్త్రి

భాగ్యం అని ఆకుర్రాడికి పెట్టినపేరు. పట్టెడన్నానికైనా నోచక, దరిద్రమా! అంటే 'ఓయ్' అంటూ జవాబిచ్చే వంశం అతనిపుట్టుక. ఆపూరిగుడిశ, బింకిబొంకి గోనంకాలవంటి బట్టలూ, జీర్ణించినశరీరంగుండా నవనరాలుపైన బడుతూన్నట్టుండి, హస్తిపంజరంలాంటి భయంకరమైన శరీరాలు — వారినితప్ప దరిద్రదేవతకు వేరేవరులు దొరకలేనట్టుండేది: కాలగతి నెవరూ నిర్ణయించలేరుకదా!

మణిలా పుట్టాడు "భాగ్యం" వారివంశంలో. భాగ్యంపుట్టిననుండీ ఇంట్లో కొంత క్రొత్తకళ పుట్టింది. కొంచెం బ్రతుకుతెరవుదొరకడ మారంభించింది. ఆపుట్టిన"భాగ్యం" అదృష్టమే కారణమై వుండాలని తల్లిదండ్రులు కుర్రాడ్ని చూసి మరీ పరుగులుపెట్టేవారు ఆనందంతో. ఆనాటికానాడు కూలిపనులు దొరకడం ప్రారంభించింది. ఆడామొగా అందరూ కష్టపడేవారు. ఏపూటభత్యం మాపూట గడించుకునేవారు. విచారమన్నది మరిచారు. రోజు తప్పకుండా పసుపూ, నూనెతో భాగ్యానికి తలకడిగి, సాంబ్రాణిధూపం వేశేవారు. ఐతే చేతిలో రెడీగా పైసా నిలవలేకపోయినా — అంతకు సర్దిపోదగినవంతు ఏరోజుకారోజు దొరికేది — చాలదూ!

భాగ్యం నానాటికి పెరిగి అతీసాత్త్వికుడైనాడు. పెద్దలంటే వినయం, విధేయత, పిన్నలంటే వాత్సల్యం, అతడికి పెట్టని భూషణాలు. మాట నెమ్మది, చేత నెమ్మది నలుగురియందు అడకువ — అతడికి ఉగ్గుతో పోశారేమో తల్లిదండ్రులు. స్వకష్టం, కాని అన్యాశ్రయం అరగదని అతడి 'పాలిసీ' ప్రాయం —

పన్నెండేళ్లు. తల్లిదండ్రులు, అన్నదమ్ములు అల్లారుముద్దుగా పెంచుతున్నారు భాగ్యాన్ని. అప్పటి కింకా యథాప్రకారంగా, నిర్విచారంగా, నిరాడంబరంగా వారిజీవనం గడుస్తుండేది. భాగ్యానికి తన బరువు తనకు తెలిసింది. ఊరకే కూచున్నకంటే తనుకూడా కష్టపడి తనవంతైనా గడించుకుంటే బాగుణ్ణనుకునేవాడు. తనుకూడా కూలికి పోతానని తల్లితో తగువులాడేవాడు రోజూ. వెనకాలేవచ్చి సాయంచేస్తానని తండ్రితో వాదులాడేవాడు నిత్యమూను. కాని అతడ్ని గుమ్మం దాటనిచ్చేవా రెవరూ?

ఓనాడు సాయంకాలం కొంత కిరాణి సామాను కొని తేవడానికని ఊళ్లో కెళ్లాడు. ఏదో ఆలోచించుకుంటూపోయాడు.

కొట్లో సెట్టి చాలా తొందరగా వున్నాడు. వచ్చేపోయేజనంకూడా ఎక్కువగానే వున్నారు. కాళ్ళతో చేతులతోకూడా సెట్టి ఆసామానులమధ్య బొంగరంలా గిరగిర తిరుగుతున్నాడు. ఎవరి సామాను గురించి వారికే తొందర. భాగ్యానికికూడా సామాన్లు కావాలి. సెట్టి కష్టం చూస్తుంటే అట్టే తొందరచెయ్యకూడదనేబుద్ధి తనకే కుదిరిందికాబోలు గుప్ చవ్ గా వూరుకున్నాడు. కాలాతీతంతల్ల ఓసారి, రెండుసార్లు పిలిచాడేకాని సెట్టి ఇటువైపే చూడలేదు. కొంతవరకూ వూరుకుని ఈసారి గట్టిగా పిలిచాడు.

"ఉండలేవురా! అందరికీ తొందరే—నీకూనా? గింజుకుంటోంటే చూడవ్? ఊపిరేమైనా ఆడుతున్నాదా?" అన్నాడు సెట్టి.

"పైసామజాయెలాగనుకున్నావ్? నష్టమన్నది ఉండకూడదాయె. ప్రతీదమ్మిడీ వస్తువలోనూ గ్రుడ్డిగవ్వపాటైనా లాభంలేక కొట్లోనుండి కదలడానికి వీలులేదు. దానికీమాత్రమేనా కష్టపడాలా? — వద్దా?" అన్నాడు అందులో ఒకడు.

అందరూ పకపకానవ్వారు. భాగ్యానికి నవ్వురాలేదు. తిరిగి సామాను లడగడానికి మనసుపుట్ట

లేదు. ఐన ఆలస్యమయినా సరే ఈకొట్టు వదిలి వెళ్ళిపోడానికి మనస్సు ఒప్పలేదు. మరో పావు గంట గడిచింది. భాగ్య మింకా అలానే నిలుచున్నాడు.

"అబ్బాయీ! నీ కాలస్య మైపోయిందిరా పాపం!!" అంటూ పొట్లాలు కట్టియిచ్చాడు.

"నౌఖరీవాడు లేకపోవడంవల్ల యింత చికాకూను" అన్నాడు సెట్టి. భాగ్యాని కెవరో గిల్లినట్లయింది.

"బాబూ!— ఐతే నౌఖరీవాడులేడూ?" అన్నాడు.

"ఆచవట ఒకనాడొస్తే నాల్గురోజులు రోగమంటాడు—ఎగవేస్తాడు. ఎవడైనా మంచి కుఱ్ఱాడి గురించి చూస్తున్నాను. ఈ వెధవని గెంటేస్తాను"

భాగ్యాని కామాట లెంతో ఆనందమిచ్చాయి. ఎన్నాళ్ళనుండో తను తలుస్తూన్నది నేడు నెరవేరింది. ఓఆశ పుట్టింది — "బాబూ క్షమించండి! నన్ను నౌఖరీలో చేర్చకూడదూ?"

భాగ్యాన్ని చూస్తూంటే సెట్టి మనస్సు ఎందుకో మారింది. "సరే... కాని, ఎగవేయకుండా రోజు రావాలిసుమా?" అన్నాడు నవ్వుతూ.

'ఒక్కరోజైనా తప్పనండి — నిజం చెప్తున్నాను' అన్నాడు భాగ్యం.

'జీత మెంత కావాలి? అదికూడా తేల్చెయ్' అడిగాడు సెట్టి.

'తమరిష్టం. న్యాయాన్యాయాలు చూసి మీరే తేల్చెయండి' వినయంగా విన్నపించాడు.

'నెలకు రెండురూపాయ లిస్తాను. ప్రొద్దున్న ఆరునుండి పన్నెండువరకు. తిరిగి రెండునుండి ఏడు, ఎనిమిదివరకు పనిచెయ్యాలి ... ఇందుకు ఒప్పుదలేనా?" సెట్టి ప్రశ్నించాడు.

రెండురూపాయలంటే తనకోరిక నెరవేరినదన్నసంతోషంలో ... రెండులక్షలు దొరికినట్లు భావించాడు భాగ్యం.

తల్లిదండ్రులు, అన్నలు భాగ్యాన్ని గట్టిగా గసిరారు. కాని మాటయిచ్చినతరువాత తప్పడ మిష్టంలేదన్నాడు భాగ్యం. అతడి పట్టుదల నింకెవరూ ఆపలేకపోయారు.

భాగ్యానికి దినమంతా కొట్టుపనితోనే తీరిపోయేది. తూచాకుడా మాటలో తప్పకుండా punctual గా వుండేవాడు భాగ్యం. పదిహేను రోజులైంది అతడు పనిలో ప్రవేశించి. కాయకష్టా లెరుగని పసివయస్సులో పడుతూన్న బడలికమూలాన్ని ఆరోజున కదలలేకపోయాడు. ఆసాయంకాలానికి జ్వరమొచ్చింది. సెట్టి యేమంటాడో నని తండ్రిద్వారా కబురంపాడు. సెట్టికి చెయ్యి విరుచుకున్నట్లయింది.

పదిహేనురోజులవరకు భాగ్యం పనిచేయడానికి వీలులేకపోయింది. తిరిగి నెలాఖరునాడు


సి. జి. ఆర్.

రింగ్వరం

ఆయింటుమెంట్

సుప్రసిద్ధ పైపూత ఔషధం

ఒక్కపూటతోనే గుణం కనిపిస్తుంది.

తామరున్నచోట రాత్రిపూట బాగా మర్దించి ఉదయానే సబ్బుతో కాని, షీకాయి పొడితోగాని కడగవలెను. వెల సీసా 1-కి 0-8-0.

స్టాకిస్టులు: ఏ. స్వర్ణ & కో., 113, మింట్‌స్ట్రీట్, జి. టి., మద్రాసు.

కొట్టుమీదకెళ్లాడు. సెట్టికి అతివినయంగా నమస్కారం చేశాడు.

ఎవరితోనో మాటాలుతూన్న సెట్టి దిగ్గున లేచి పెట్లోనుండి రూపాయి తీసి భాగ్యాని కిచ్చాడు. భాగ్యాని కాజీతం ఎంతో యిదిగా తోచింది.

'ఆరూపాయ నిలా పారేసి టిక్కెట్టు కొనుక్కోకూడదూ? పోతే రూపాయి. ఫస్టుప్రైజు వచ్చిందంటే లక్ష — ఏమబ్బాయీ?' అన్నా డాతడు నవ్వుతూ.

ఆమాటలు ఆక్రొత్త మనిషి వద్దకు లాగేయి భాగ్యాన్ని. పరుగున వెళ్లాడు భాగ్యం రూపాయతో కూడా.

"ఉన్నరూపాయిని వదులుకోవడం తప్ప లాభంలేదుసుమా భాగ్యం? మేమంతా పాతికేసి రూపాయలుపోసి టిక్కెట్టుకొన్నా దమ్మిడీకి కొరగాకుండాపోతోంది...అయ్యో! మీ నాన్నకి తెలుస్తే ఏమంటాడు?" అన్నాడు సెట్టి. భాగ్యాన్ని ఏడుపొచ్చింది తండ్రిమాట తలిచాటప్పటికి. ఆమనిషి వద్దకువెళ్లి దీనంగా చూశాడు.

"అలా వీల్లేదు. ఇష్టమైతే టిక్కెట్టుతీసుకో. ఇష్టంలేకపోతే మానీయ్ డబ్బు వాపసు చెయ్యను-అన్నాడు ఆయన. సెట్టి ఆశ్చర్యంగా చూశాడు. భాగ్యానికి కళ్ళవెంబడి నీళ్లు కారుతున్నాయ్.

సెట్టికూడా భాగ్యాన్ని వెనకవేసుకొచ్చాడు. ఆమనిషి మాటాడకుండా వెళ్ళిపోయాడు. భాగ్యానికి పట్టరానిదుఃఖమొచ్చింది. తిరిగి నౌఖరీచేసి ఎలాగైనా ఈ బాకీతీర్చేయ్యడానికి నిశ్చయించి తన్నుతాను వూరుకోపెట్టుకున్నాడు.

రెండోనెలాఖరు మళ్ళిపోయింది. పోస్టుబంట్రోతు టెలిగ్రాం పట్టుకొచ్చాడు.

"భాగ్యంపేరను ప్రైజు-లక్ష"

తల్లిదండ్రులు కళ్ళవెంబడి నీరుకార్చారు. భాగ్యానికి సంతోషం అతీతం.





శుక్లనష్టానికి వజ్రాయుధం

'లుకో'

కలలోను, మూత్రంతోను పోయే యెటువంటి శుక్లనష్టమైనా నిల్చును. నీరైన వీర్యమును గట్టిపరచి, పురుషత్వము నధికముచేసి జీవితమును సంతోషమయముగ జేయును.

చిన్నపాకెట్టు రు. 3-0-0. పెద్దది రు. 5-0-0




బ్రెయినాల్

రుచికరమైన మెదడు టానిక్. మెరడు యొక్క అలపు, జ్ఞాకశక్తిహీనత 'న్యూరస్థీనియ' అనబడు నరముల సడలిక, మొదలగు మెదడు వ్యాధులన్నిటికిని అద్భుత ఔషధము. 'బ్రెయినాల్' జ్ఞాపకశక్తిని వృద్ధిపరచి, మెదడుకు చురుకు. శరీరానికి వుత్సాహము కలిగించును. సుఖనిద్రను కలిగించి, వ్యాకులతను. బలహీనతను పోగొట్టును, బలము, రక్తపుష్టిని కలుగజేయును. విద్యార్థులు మెదడుతో పనిచేసేవారు తప్పక వాడదగినది.

4 ఔన్సులు రు. 4-8-0. 8 ఔ॥ రు. 8-4-0.

వి. చార్జీలు ప్రత్యేకము.

ది మెడికల్ ప్రొడక్ట్సు కంపెనీ,

పోస్టుబాక్సు నెం. 57, మద్రాసు.